శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

# అనిపించాడు!

రావమ్మ పొరుగూళ్ళల్లో వుంటూవున్న కూతురుకీ ఇద్దరు కొడుకులకీ వుత్తరాలురాసింది! రాసింది అనటముకంటే రాయించిందీ అనటమే కరక్టు. రాఘవయ్య మేష్టారు ఆమెకి వుత్తరం రాసి పెట్టారు. రావమ్మ చిన్నకొడుకు, భార్యతోసహా పొరుగూరికి వెళ్ళి ఆ రాత్రికి తిరిగి వచ్చాడు. ఆరోజు పగలు ఆపని జరిగింది! ఆసంగతి మాధవరావుకి తెలియదు.

ఇపుడు రావమ్మకి ఎనభయి సంవత్సరాలుంటాయి. ఆమెకి ముగ్గురు కొడుకులు. పెద్దవాడు కాంతారావు, పెద్ద కంట్రాక్టరు. భార్య తెచ్చిన కట్నాన్ని పెట్టుబడిగా పెట్టి కంట్రాక్టులు చేసి, ఇప్పుడు కాంతారావు లక్షలు సంపాదించాడు. బెజవాడలో పెద్ద ఇల్లు కట్టాడు. కారు మెయింటెయిన్‌చేస్తున్నాడు. అతనికి ఇద్దరు పిల్లలు. ఒకడు మెడిసినూ, రెండవవాడు ఇంజనీరింగూ చదువుతున్నారు. రెండవవాడు రాఘవరావు. ఒక ప్రయివేటు కంపెనీలో పెద్ద వుద్యోగం చేస్తున్నాడు. అతని పనీ బాగానేవుంది. హైదరాబాదులో ఇల్లు కొన్నాడు. కారూ మెయింటెయిన్ చేస్తున్నాడు. ఆ ఇద్దరు పెద్ద కొడుకుల తరవాత రావమ్మకి ఒక కూతురు. ఆమె భర్త ఇంజనీరు. ఇద్దరు పిల్లలతో ఆమె సంసారం పచ్చగా సాగిపోతున్నది. ఆవిడపేరు అంజని. ఆమె భర్త హనుమంతరావు. రావమ్మ మూడో కొడుకు పేరు మాధవరావు.

రావమ్మ కాపురానికి వచ్చేసరికి ఆ సంసారానికి పదెకరాల మాగాణి పొలమూ, పెంకుటిల్లూ, దొడ్లూ, మామిడి తోటలూ వుండి, పచ్చపచ్చగా వుండింది. సుమారు ఇరవయ్యయిదేళ్లు సాగిన పచ్చని ఆ సంసారం, పిల్లలు రెక్కలు వచ్చి ఎగిరి పోయే దశకి వచ్చేసరికి, చితికి పోయింది. పెద్దకొడుకులు ఇద్దర్కీ చదువులూ, కూతురి పెళ్ళీ, పెట్టుపోతలూ, ఇతర ఖర్చులూ ఘనంగా జరిగాయి. రావమ్మ భర్త ఇటీవల పరలోక గతుడయ్యేనాటికి ఆ సంసారానికి ఒక ఎకరం పొలమూ, చితికిపోయి శిథిలావస్థలో వున్న పెంకుటిల్లూ, మాత్రమే మిగిలాయి!

రావమ్మ సంతానం అందరి పనీ బాగానే వుంది గానీ, చిన్నవాడు మాధవరావే ఎందుకూ పనికిరాని వాడుగా మిగిలి పోయాడు అతనికి చదువు వంటబట్టలేదు. అందువలన అతను రెక్కలు రాని పక్షిలాగా ఆ ఇంటినే ఆశ్రయించుకుని వుండి పోయేడు. అతనికి నలుగురు పిల్లలు.

అన్నలూ, అక్కా ఎవరిదారి వారు చూసుకోగా, పండిముగ్గిన ఎనభయి సంవత్సరాల వయసు గలిగిన తల్లి రావమ్మను కనిపెట్టి వుండవలసిన బాధ్యత మాధవరావు పైన పడింది. అన్న లిద్దరికీ మాధవరావు అంటే చాలా తేలిక భావం వుంది. బయటి ప్రపంచంలోనికి వెళ్ళి ఒక రూపాయి సంపాదించుకు రావటం తెలీని మాధవరావు కేవలం అప్రయోజకుడనీ, మూర్ఖుడనీ, ఎందుకూ పనికిరానివాడనీ, వాళ్ళ అభిప్రాయం!

రాఘవరావు నోరు చాలా పెద్దది. అతను నోరు పెట్టుకుని అరిస్తే గజగజ లాడతాడు మాధవరావు. కాంతారావు మొహం ఎప్పుడూ మొటమొట లాడ్తూ వుంటుంది. అతను నోరు విప్పి ఏనాడూ మాధవరావుని అప్యాయంగా పలకరించిన సందర్భంలేదు. తన భర్త ఇంజనీరని అంజనికి బోల్డు గర్వం! లొడ లొడ వాగుతుంది. ఆమె నోరు విప్పితే అంతా స్వోత్కర్ష తప్ప మరేమీ వుండదు. ఆ పైన ఆవిడకి కోపం తెట్టెడంత.

రావమ్మ సంతానానికి అందరికీ, తల్లి అంటే ఎంతో ప్రేమ వుంది. అభిమానంవుంది. గౌరవం వుంది. రావమ్మ పెద్ద కోడళ్ళు ఇద్దరూ, ఆ మిగిలిన ఆస్తిపాస్తులను పంచుకొని అమ్ముకుని వచ్చేయమని, తమ తమ భర్తలకి హితవు చెప్పారు. కానీ, మాతృభక్తి ఇంకా ఇగిరి పోని, ప్రయోజకులుగా చలామణీ అవుతున్న ఆ ఇద్దరు కొడుకులూ, ముసలావిడ బ్రతికి వున్నంతవరకూ ఆ పని జరిగేది కాదని ఖండితంగా చెప్పేశారు. అయినా ఇప్పుడు తమకేం తక్కువయిందని, ముష్టి ఎకరం పొలం కోసం వీధిన పడాలీ అని చెప్పి వాళ్ళ నోళ్ళు మూయించారు.

అందువలన, రావమ్మ సంసారం ఇప్పటికీ మూసి వుంచిన గుప్పెట లాగానే వుంది. ఎవరి దార్ని వాళ్ళు దర్జాగా సంపాదించుకుని సుఖంగా సంసారాలు చేసుకుంటున్నారు. సూరయ్య కొడుకులు బుద్ధిమంతులు, బాగా పైకి వచ్చారు, వాళ్ళకి ఈ నాటికీ, తల్లి

అంటే ఎంతో భక్తీ, గౌరవమూ - అన్న పేరూ ప్రతిష్టలూ గడించు కున్నారు.

ఎన్ని వ్యవహారాలున్నా, వీలుచూసుకుని వచ్చి, అప్పుడప్పుడూ, తల్లిని చూసి వెళ్తూ వుంటాడు కాంతారావు. పం, పాం - అంటూ కారు మోగిందంటేచాలు ఆ పెంకుటింట్లో సంచలనం మొదలవుతుంది. ఎక్కడ ఏపనిలో వున్నా సరే, పరుగు పరుగున వచ్చి వరుసలో నిలబడతారు మాధవరావూ. అతని పిల్లలూ. 'మాధవరావు భార్య' గబగబా పొయ్యి వెలిగించి బావగారికి మర్యాదలు చేసే ప్రయత్నంలో వుంటుంది. కారుడ్రయివరు పళ్ళబుట్టలు తెచ్చి లోపల పెడతాడు. గ్లాస్కో-పంచనీ, లాల్చీనీ, సిల్కు కండువానీ సవరించుకుని, గోల్డు ఫ్రేం రింలెస్ కళ్ళజోడు తగిలించుకుని దర్జాగా, హుందాగా, గంభీరంగా అడుగులు వేసి వస్తాడు కాంతారావు. రావమ్మ కూర్చుని వున్న మంచం ప్రక్కన - ఆ సమయానికి ప్రక్కింటినుంచి తెచ్చిన కుర్చీ, వేయబడి సిద్ధంగా వుంటుంది.

కాంతారావు వచ్చి ఆ కుర్చీలో కూర్చుని ఆప్యాయంగా తల్లిని పలుకరిస్తాడు. ఆమె ఆరోగ్యం గురించి పరామర్శిస్తాడు. ఆమె యోగక్షేమాల్ని గురించి విచారిస్తాడు. తల్లి మీద తనకు మాభిమానాల్నీ, భక్తి గౌరవాల్నీ మాటల్లో వెల్లడిస్తాడు. మరదలు - మాధవరావుభార్య - తెచ్చి ఇచ్చిన కాఫీతాగి, లెక్చరు యిస్తాడు, తీరిగ్గా.

ఈ ప్రపంచంలో ప్రతీ జీవీ, అంతిమ శ్వాస తీసేవరకూ నిల్పుకోవలసింది, విశ్వాసమనీ, విశ్వాసం అనేది లేనివాడు అసలు మనిషేకాదనీ నవమాసాలూ మోసి, కని, పాలిచ్చి పెంచిన, మాతృమూర్తి దైవంతో సమానమనీ, తల్లి ఋణం మనం ఏమి చేసినా తీర్చుకోలేనిదనీ, తల్లిని పువ్వుల్లో పెట్టి చూసుకున్న వాడి జన్మ సార్థకమనీ అందువలన తల్లిని ఆదరాభిమానాలతో చూసుకుని పూజించవలసిన బాధ్యత పిల్లలదనీ, ఎంతో ఆవేశంగా చెప్పి, ఆ పారవశ్యంలో కన్నులు చెమ్మగిల్లగా - తల్లిపాదాలు అంటి ప్రణామం చేసి - తన భక్తి ప్రపత్తులను వెల్లడించి -

'అమ్మా ! నిన్ను తమ్ముడు జాగ్రత్తగా చూసుకుంటున్నాడా ? !' అని రావమ్మని గద్గద స్వరంతో అడుగుతాడు కాంతారావు. అప్పుడు రావమ్మ ఉబ్బి, పొంగిపోయి, తన బాధల్ని ఏకరువు పెడుతుంది.

తన కాళ్ళల్లో నీరు పట్టిందనీ, అప్పుడప్పుడు కళ్ళు తిరుగుతున్నాయనీ, వంట్లో నీరసంగా వుంటూందనీ, తిన్నది అరగటం లేదనీ కాంతారావుకి చెపుతుంది.

అప్పుడు -

మొహం మొట మొట లాడించిన కాంతారావు, తమ్ముడు మాధవరావు వంక పురుగుని చూసినట్లు చూసి - పళ్ళు పటపటమని పించి -

'కాస్తయినా శ్రద్ధ అనేది వుండాలి. ముసలామె అంత బాధ పడ్తూ వున్నప్పుడు, అలా నిశ్చింతగా తిరగటానికి అసలు మనస్సెలా వొప్పుతుంది ? డాక్టరుకి చూపించవచ్చు గదా' - అని తమ్ముడికి అన్యాపదేశంగా ఆదేశాలు జారీచేసి, ఇక నైనా తల్లిని జాగ్రత్తగా చూసుకొమ్మని తీవ్రంగా హెచ్చరించి, అర్జంటు పని వుందనిచెప్పి కారులో వెళ్ళగా, అప్పుడు ఆ ఇంట్లో గాలివాన కురిసి, వెలిసినట్లవుతుంది ! అప్పుడప్పుడు, కంపెనీ పని మీద ఆ వయిపు వచ్చినపుడు రాఘవరావూ, కారుమీద తప్పకుండా వచ్చి తల్లిని చూసి వెడతాడు. నోటితోపాటు అతని ఆకలీ పెద్దదే ! రావటమే అతను, పెద్ద నోరు పెట్టుకుని, అరుస్తూ దిగుతాడు. చిన్నప్పుడు మాధవరావు అతనిచేత పిడిగుద్దులు తిని పెరిగాడు. రాఘవరావుది అరడుగుల పెద్ద శరీరం. కండలు బట్టిన వళ్ళు. కోడిలేనిదే అతను ముద్ద ఎత్తడు ! అందువలన రాఘవరావు కారు రాంగానే, మాధవరావు, కొడుకుని కోడిని కొనుక్కు రమ్మని వూరి మీదకి తోలుతాడు. బండగా అరుస్తూ, వీలయినప్పుడల్లా మాధవరావుని తప్పుపట్టి తిడుతూ, నలుగురి ఎదుటా కించపరుస్తూ, తల్లి ఎడల తనకుగల అపారమయిన భక్తి గౌరవాలు వెల్లడించి, అలిసి కాస్సేపు గుర్రుకొట్టి నిద్ర పోతాడు రాఘవరావు. అతను నిద్ర లేచేసరికి కోడికూరతో భోజనం సిద్ధంగా వుంటుంది. అప్పుచేసి కొని తెచ్చిన వెన్న కరగ బెట్టిన నెయ్యి నిండినగిన్నె, ఆ ప్రక్కన వుంటుంది. రాజఠీవితో భోజనం తృప్తిగా కానిస్తూ -

'అమ్మా నువ్వుకూడా వచ్చి నాతోపాటు కూర్చుని కోడి కూరతో ఒక ముద్ద తినరాదటే ?' అని ఆప్యాయంగా పిలుస్తాడు రాఘవరావు, తల్లిని.

అప్పుడు రావమ్మ మొత్తుకుంటుంది. తనకష్టాలన్నీ ఏకరువు పెడ్తుంది.

'నాన్నా ! నాకేదీ అరిగి చావటంలేదురా. ఏదయినా మోజుపడి తిని చచ్చానా, వెంటనే కడుపులో త్రిప్పి, ఆయాసం వస్తుంది ! నీరసం బాబూ ! గుండెదడకూడా !'

అప్పుడు రాఘవరావు పెద్దగా అరుస్తాడు. మాధవరావుని కోపంగా చూస్తాడు.

'ఒరేయ్ ! జన్మనిచ్చిన తల్లిని ఇట్లా ఆరడిపెడ్తే నీకు ఇక పుట్టగతులు వుండవురా ! ఏం ? డాక్టరుకి తీసికెళ్ళి చూపిస్తే నీ సొమ్మేం పోయిందీ ? మేమేనాడన్నా నిన్ను లెక్కలూ, డొక్కలూ అడిగామా ?! తల్లి కోసం ఖర్చు పెట్టవద్దన్నామా ? కన్నతల్లిని ఇట్లా ఏడిపించినవాడు, వాడు అసలు కొడుకేగాదురా ? మనిషి అన్నాక కాస్త బుద్ధీ జ్ఞానం వుండాలిరా. ఇదుగో. నేను చెప్తున్నాను విను. నువ్వు గనక ఇట్లా పిచ్చవేషాలు వేసావంటే తిక్క రేగుకు నొచ్చి, నేనేం చేస్తానో నాకే తెలియదు ! ఛ. ఛ. ఏం వస్లురా ఇవీ ?' అని నానావిధాల చీవాట్లు పెడతాడు.

దోషిలాగా నిలబడి నోరెత్తకుండా చీవాట్లు తింటున్న తండ్రినీ, చకచక భోజనం కానిస్తూనే అరివీర భయంకరుడులాగా నోటితో విజృంభిస్తూవున్న పెదతండ్రినీ, చకచకా మాయమవు తున్న కోడి కూరనీ, గిన్నెడు నెయ్యినీ, అన్నాన్నీ నోర్లూరగా చాటునుంచీ చూస్తూ నుంచున్న మాధవరావు పిల్లలు, ఆశ్చర్యంతో కళ్ళు టపటపలాడిస్తారు. నోర్లువెళ్ళబెట్టి, సోంబేరుల్లాగా, ముడ్డిమీద నుంచి కిందకి జార్తూవున్న చెడ్డీల్ని పైకి లాక్కుంటారు. ముక్కు లుద్దుచుకుంటారు !

ఇకనయినా, తల్లిని జాగ్రత్తగా చూసుకొమ్మని మాధవ రావుకి తీవ్రమయిన హెచ్చరికలు జారీచేసి, బూట్లు టకటక లాడించుకుంటూ వెళ్ళి, కారు ఎక్కుతాడు రాఘవరావు. దుమ్మును వెనకాలే విరజిమ్ముకుంటూ దూసుకుపోతున్న ఆ కారునే అందరూ నోర్లు తెరిచి చూస్తారు !

తన పెళ్ళయిన కొత్తల్లో అంజని, కన్నవారిని నానావిధాలా సాధించింది. పెట్టుబడులూ, కానుకల విషయంలో, అలిగి నానా రాద్ధాంతాలూ చేసింది ! ఇంజనీరయిన భర్తకి రోలెక్సువాచీ, స్కూటరూకొని ఇస్తేగానీ వల్లగాదని శఠించి వాటిని పుచ్చుకుంది. అప్పుడప్పుడూ గాలి మళ్ళినప్పుడు, అంజని, పటాటోపంతో హంగా మాగా, పట్టుచీరెలు గరగర లాడించుకుంటూ, మెడనిండా నగలతో బోలెడు భేషజంతో పుట్టింట్కి వస్తుంది. ఆ నాలుగు రోజులూ అంజనికి సకల మర్యాదలూ జరగాలి. ఎక్కడ ఏ లోపం జరిగినా అంజని పెద్దనోటితో ఎన్నో చదువులు చదువుతుంది. ఇన్‌డయి రెక్టుగా నిష్ఠూరపు బాణాలు వదులుతుంది.

మెట్టినింట ఎన్ని భోగభాగ్యాలున్నా, ఆడపిల్లకి, పుట్టింటి మీద ఎంతగా మమకారం వుంటుందో ఆమె నొక్కి వక్కాణి స్తుంది ! అడపడుచు సంతోషంగా వుంటేనే ఆ ఇంటికి జయమని లెక్చరిస్తుంది ! తల్లి, రావమ్మని కావిలించుకుని, ఆవిడ దుస్థితికి రాగాలు తీస్తుంది. దాంతో, కడుపు చెరువయిన రావమ్మ, నిజమేగదా అనుకుని, తనూ రాగాలు దీస్తుంది. ఆ ఇద్దర్నీ ఆ స్థితిలో చూసి కడుపులో దాగిన బాధలు చెరువయిన మాధవరావు భార్య, తనూ కళ్ళనీళ్ళు పెడుతుంది ! ఒక ప్రక్కన బంధువులకు చేయవలసిన మర్యాదలతో విరుగుతున్న నడుమూ, వడ్డీలు పెరుగుతున్న అప్పులూ, చాతగానివాడిలాగా, దోషిలాగా, దుర్మార్గుడిలాగా, నర కానికి పోయేకన్న తల్లిని నానాయాతనలకూ గురిచేసే - పాపాత్ము డిలాగా, ఆరోపణలకి గురి అవుతూవున్న భర్తా, ఏదో మిగిలి పోయిందనీ, అంతా తామే తిని పోతున్నారనీ, పిత్రార్జితాన్ని తమ హక్కు భుక్తంగా చేసుకుని తామేమింగివేస్తున్నారనీ నలుగుర్తోనూ నానా విధాలుగా నిందారోపణలు చేసే తోడికోడళ్లూ, అన్నిట్నీమించి, వేధిస్తూ వున్న దుర్భరదారిద్ర్యమూ, నలుగురిలోనూ పలచనయిన ప్రతిష్ట స్థితిగతులూ, లేకిచూపులు చూస్తూ పిచ్చివెధవల్లాగా పెరిగి వస్తూవున్న పిల్లల, అయోమయంగా అన్పించిన భవిష్యత్తూ-

కారణాలు తెలీకపోయినా, విశ్లేషణ చెయ్యటం ఎరక్క పోయినా, ఇవన్నీ తలపుకి వచ్చి మాధవరావు భార్యకి, కడుపు చెరువవుతుంది ! ఒక విధమయిన డిప్రెషన్‌కి లోనయిన ఆమె మనసు వేదనాలోలితమవుతుంది !

ఈ మనిషి శరీరం యంత్రం వంటిది. దానికీ అరుగుదల వుంది. వయస్సులోవున్నప్పటి తిండి పుష్టీ, కండపుష్టీ, జవం, జీవం వయస్సుమీరిన తరువాతకూడా వుంటాయని ఆశించటం, అసహజం. వయసు మళ్ళిన, శరీరం కొంత నష్టానికి గురవక తప్పదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకుని కాపాడబోయినా, ఆ శరీరం మరి కొన్నాళ్ళ పాటు మనుగడను పెంచుకొనగలదేమోగానీ, శిథిలమయి, నశించి పోవటాన్ని తప్పించుకోజాలదు ! జరా పీడితమయి శిథిలావస్థకు గురయిన, శరీరాన్ని చికిత్సలు పునరుజ్జీవింప చేయలేవు. ఆహార విహారాల్లో తగు కట్టుబాట్లు ఏర్పర్చుకుంటే, ఆ శిథిల శరీరాలు కొంత మెరుగయిన స్థితిని అందుకోగలవు. కానీ, వయస్సులో వున్నప్పటిలాగా, ప్రతీదీ తినాలనీ, అరగించుకోవాలనీ, సులువుగా సుఖంగా నడవాలనీ, ఏ విధమయిన రుగ్మతలూ తమ దరినిచేర రాదనీ, వయసు పండిన వృద్ధులు ఆశించటం, అత్యాశే అవుతుంది! అందువలన, ఈవిడ, వుప్పూ, కారం తినరాదు. నూనె పదార్థాలు తినటం మానెయ్యాలి. తేలిగ్గా జీర్ణమయ్యే పదార్థాల్నే తీసుకొనాలి. విశ్రాంతి, బాగా కావాలి. పళ్లూ ఫలాలూ పుచ్చుకోవాలి. అంతేగాని మందులూ మాకులూ వాడినందువలన ఎనభయి సంవత్సరాల వయసుగల ఈ శరీరానికి ఏమీ వుపయోగంలేదు - అని రావమ్మని పరీక్షించిన డాక్టరు చెప్పాడు.

'ఆఁ. అడిబొంద! మందులివ్వవయ్యా అంటే మాటలు చెప్పే ఇతను ఏం డాక్టరూ ?! ఇంకో డాక్టరుకి చూపించు, నన్ను' అని ఆజ్ఞాపించింది రావమ్మ కొడుకుని.

ఆ ఇంకో డాక్టరు ఆమెని పరీక్షించి నీళ్ళ ఇంజెక్షన్లుపొడిచి మందులు రాసిచ్చి, వందరూపాయలు గుంజుకున్నాడు. కొన్నాళ్ళ తరువాత - 'ఆ మందులు పనిచేయటం లేదు. కొత్త మందులు కావాల'న్న ఘోష. వృద్ధాప్యంలో పసితనం ఆవహించిన వృద్ధురాలి మందుల మానియా! చెపితే అర్థంకాదు. కాదంటే అపారాలు. కన్నతల్లి.

రెండు సంవత్సరాల క్రితం - 'అమ్మని మంచి డాక్టరుకి చూపించి, నాలుగు నెలలు వుంచుకుని పంపిస్తామ'ని తీసుకెళ్లాడు కాంతారావు. నెల తిరక్కుండానే - నేనక్కడ వుండలేనే ?- అంటూ తిరిగి వచ్చింది రావమ్మ. పెద్దకోడలు ఎంతో ప్రేమగా చూసిందట! తనని కన్నతల్లిలాగా ఆదరించిందట! కానీ తనే అక్కడ వుండలేక పోయిందట! అలాగే, రెండో కొడుకు దగ్గర వుండివస్తానని ఆ మధ్యవెళ్ళింది రావమ్మ. రెణ్నెల్లు వుండివస్తానని చెప్పి వెళ్ళిన పెద్దమనిషి, పదిహేను రోజులకే, వూళ్ళో బస్సు దిగింది! ఆ నీళ్లు తనకి పడలేదట! ఇంకా కొన్ని నాళ్ళు వుండి పొమ్మని రెండవ కోడలు ఆమెను ఎన్నో విధాలుగా బ్రతిమాలిందట! లోగుట్టు పెరుమాళ్ళకెరుక! ఏం గొడవలు పడిందో ఏమో గాని, ఆమె తన పెద్దకోడళ్ళు ఇద్దరి గురించీ చాలా చాలాఘనంగా చెప్పింది. వాళ్ళ భోగభాగ్యాల ముందు, ఆమె కళ్ళకి చిన్నకోడలు ఒక పనికిరాని దానిలాగా, ముసలావిడకి అప్పించింది. ఒకసారి, అంజని కూడా, తల్లిని కొన్నాళ్ళు తనవద్ద వుంచుకుని పంపిస్తానని తనతో తీసుకెళ్ళింది. కాని, వారం రోజులు తిరగకుండానే, కూతురితో ఏదో గొడవపడి, తిరిగి వచ్చేసింది, రావమ్మ.

ఈ మధ్యన ఒకరోజు, తనకి పకోడీలు తినాలని వున్నదని చిన్న కొడుకు మాధవరావుతో చెప్పింది, రావమ్మ. అవి ఆమెకు పడవు. అజీర్ణం చేస్తుంది. కడుపుబ్బరం వస్తుంది. వద్దని చెప్పాడు మాధవరావు. తనకి తినాలని కోరికగా వుంది. ఏమయినా సరే తినాల్సిందేనని, పట్టుబట్టింది రావమ్మ. గొడవ చేసింది; నిష్ఠురాలు ఆడింది; ఆ బాధపడలేక, పకోడీలు తెచ్చిపెట్టాడు మాధవరావు. శుభ్రంగా తిని సంతృప్తిపడి కొడుకుని ఆశీర్వదించింది. కానీ-

మర్నాటికి గుడగుడమంది, కడుపులో. విరేచనాలుతగులుకున్నాయి. వారం రోజులు మంచం దిగలేదు రావమ్మ. నీరసం, ఆయాసం ముంచుకుని వచ్చాయి. నరాలు తెగతీపులు పెట్టాయి. కీళ్ళల్లో ఒకటే నొప్పులు! మాధవరావు భార్య ఉచ్చ గుడ్డలు కూడా ఉతికింది. మాధవరావు ఆమె దొడ్డి పళ్ళెం శుభ్రం చేసాడు. కన్నబిడ్డలాగా అమెని కంటికి రెప్పలాగా చూసుకున్నారు. డాక్టర్ని తీసుకొచ్చి చూపించారు. మందులు వాడటం చాల జాగ్రత్తగానే జరిగింది. కాని, రుగ్మత అంత తేలిగ్గా తగ్గలేదు. నెలల తరబడి పట్టుకుని, అది రావమ్మ ముసలి శరీరాన్ని వదిలి పెట్టలేదు! ఒక దాన్తరువాత మరొకటి!

రావమ్మ గోల బెట్టింది. బాధ పడింది.

ఏడ్చింది. మొత్తుకుంది. దిగులు బెట్టుకుంది.

ఈ బాధ తను పడలేనని గొడవ చేసింది. పుల్లలాగా అయిపోయింది.

సరిగ్గా అప్పుడే ఆ కబురు వచ్చింది! 'మాధవరావు అత్తగారు' గుండెపోటు వచ్చి తనువు చాలించిందన్న కబురు తెచ్చాడు, అవచ్చినతను. తప్పలేదు. తల్లిని జాగ్రత్తగా చూడమని రాఘవయ్య మేష్టారికీ, పక్కింటి పున్నమ్మకీ చెప్పి, ఏడుస్తూవున్న భార్యనీ పిల్లల్నీ తీసుకువెళ్ళి ఆమె పుట్టింట్లో వదిలేసి, తను ఆ రాత్రికి రాత్రే తిరిగి వచ్చాడు!

అవాళ్నే రాయించింది ఉత్తరుకీ, కొడుకులకూ, ఉత్తరాలు రావమ్మ!

'ఇక్కడ నాకేమీ బాగా జరగటంలేదు! నేను మంచం మీదపడి అవసాన దశలో కష్టంలో వున్నాను. నేను పోయేలోగా ఒకసారి వచ్చి చూసి పోవలసింది' - అంటూ సారాంశం.

ఆ మూడు రోజులూ తల్లిని కంటికి రెప్పలాగా చూసుకున్నాడు మాధవరావు. తనే స్వయంగా ఆమె వుచ్చగుడ్డలు వుతికాడు. ఆమె దొడ్డి పళ్ళెం శుభ్రం చేశాడు. ఆమెకు మందులు తాగించాడు. పళ్ళరసాలూ, గ్లూకోజు నీళ్ళూ పట్టాడు. ఆమెను అనునయించీ, బుజ్జగించీ, ధైర్యం చెప్పాడు. ఆమె ఏడిస్తే తనూ ఏడ్చాడు. ఆమె నవ్వితే తనూ నవ్వాడు! నిద్రాహారాలు మాని, ఆమెని కంటికి రెప్పలాగా చూసుకున్నాడు. మాటిమాటికి డాక్టర్ని పిలుచుకునివచ్చి చూపించాడు. అప్పుచేసి మందులు తెప్పించి, వాడాడు!

ఉత్తరాలేసిన మూడోనాటి పుదయమే, రెండు కార్లూ, ఒక టాక్సీవచ్చి ఆ పాడుపడిపోయిన పెంకుటింటి ముందు ఆగాయి. మొహం మొట మొట లాడించుకుంటూ, కాంతారావూ అతనిభార్యా వచ్చారు. బండగా మాట్లాడ్తూ రాఘవరావూ, అతని వెనుక అతని భార్యా, దిగారు. బులి బులి ఏడ్పులూ ఏడుస్తూ అంజనీ, ఆమెతోపాటు ఆమె భర్తా టాక్సీ దిగారు.

అప్పటికే - రావమ్మ శవాన్ని తీసుకొచ్చి, బయట వాకిట్లో గడ్డి మీద పడుకో బెట్టారు. మాధవరావు చేసిన సేవలు అన్నీ వుప యోగం లేకుండా పోయాయి.

గొల్లున ఏడ్పులూ ! అరుపులూ !

శాపనార్థాలూ ! సాధింపులూ, పెల్లుబికిన దుఃఖాలూ.

చురచుర చూసి, కళ్ళనుంచి నిప్పులు రాల్చాడు కాంతారావు.

పిచ్చి ఎత్తినట్లుగ అయి బండబూతులు తిట్టాడు, రాఘవ రావు.

అంజని ఏడుస్తూ ఎన్నో చదువులు చదివింది. అన్నిటికీ టార్గెట్ ఆ మాధవరావే ! అది చూసిన వాళ్ళందరూ, అయ్యో అని నిట్టూర్చారు ! మాధవరావు ఎంత క్రూరంగా, కర్కశంగా, రాక్షసుడిలాగా ప్రవర్తించి, కన్నతల్లినే చంపుకున్నాడూ ! అతనికి ఇక అసలు పుట్టగతులుంటాయా? అని అనుకున్నారు. ఆ తరువాత జరుగవలసిన పనులను గురించి, నిర్లిప్తంగా ఏర్పాట్లు చేయటంలో మునిగిపోయిన, మాధవరావు, అందరి కళ్ళకీ ఒక ఘోర దుష్ట భయంకర రాక్షసుడిలాగా కన్పించాడు. ఎర్రబడిన కళ్ళూ, రేగిన జుట్టూ, అలసిన శరీరంతో, అతనొక భయంకర పిశాచిలాగా అన్పిం చాడు, అన్పించాడు, అంతే !

~~~~~~

# నిస్స్వాగతము

## శ్రీ రావోలు పరమేశ్వరరావు

నిష్ఠుర నిర్ఘాత నిర్ఘోషలతో నిండి
విఘూర్ణితమైన విషవలయాలతో
వచ్చిన - దీపావళికి
స్వాగతం చెప్పలేను ....

సున్నిత సుకుమార స్వాంతములో
శాంతిని, క్షాంతిని ప్రేల్చుతూ
సాక్షాత్కరించిన దీపావళికి
స్వాగతం చెప్పలేను ....

నిర్మల నిశ్చల సుందర
మందార సరస్సులో
భీకరాకార బడభాగ్నులు
లేపుతూ
అవతరించిన దీపావళికి
స్వాగతం చెప్పలేను ....

సుధచిలికి, సుఖము నిలిపే
అధరాల మరాళి -
కరాళి అయినపుడు !

దివ్వెల
దీపావళికి
స్వాగతం చెప్పలేను !!
~~~~~~